క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్ఎం

చైతన్యపురి: టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ నుంచి బయలుదేరే జిల్లా సర్వీసుల గురించి ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు, ఫిర్యాదు స్వీకరించేందుకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్–2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. సిటీ బస్సులే కాకుండా జిల్లా, దూర ప్రాంత సర్వీసుల గురించి, హైదరాబాద్–1, హైదరాబాద్–2, పికెట్, మియాపూర్–1, బీహెచ్ఈఎల్, పరిగి, తాండూరు, వికారాబాద్ డిపోల బస్సు సర్వీసుల గురించి కూడా ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలు సెల్ నం .9959226241 కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు.

సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం



బట్టు దాసురావు

మలక్‌పేట: భద్రత, నమ్మకం లేని టీఎస్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టు దాసురావు అన్నారు. టీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం బిల్లుపై గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో గురువారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాసురావు మూసారంబాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల సమాజంలో ఆర్టీసీ ఉద్యోగులకు గౌరవం పెరిగిందన్నారు.

హెలన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేయడానికి వికలాంగుల సంక్షేమ భవనానికి వచ్చిన ప్రసాద్ తదితరులు

చాదర్‌ఘాట్: ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా ఈనెల 26న మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కు ప్రాంగణంలో హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ దిడెఫ్ నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీఎస్‌డీ నేషనల్ కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, భారతి పాల్గొన్నారు. కాగా, ఈ 26న హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించండి

చైతన్యపురి: డివిజన్‌లోని కాలనీల్లోని డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, మ్యాన్‌హోళ్ల సమస్య, లోప్రెషర్ తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతూ చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. వికాస్‌నగర్, ఫణిగిరి కాలనీ, ద్వారకాపురం, సాయినగర్, విద్యుత్‌నగర్, దుర్గానగర్, భవానినగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య ఉందని, తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీఎంకు వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

17న విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు నిర్వహిస్తున్న విశ్వకర్మ యజ్ఞ చైర్మన్ శ్రీనివాసచారి తెలిపారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు రవి చారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం సంఘటిత కార్యదర్శి పున్నోజు రామకృష్ణ, యజ్ఞ కమిటీ ప్రధాన కార్యదర్శి నారాయణదాస్ ప్రవీణ్ చారి, యజ్ఞ కమిటీ కోశాధికారి తట్కూనూరి రవి తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం

చైతన్యపురి: తలసేమియా, సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం సంతోషదాయకమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ సురేష్‌గుప్తా అన్నారు. తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్, మారుతి టెక్నాలజీ, ఎస్‌వీ ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సురేష్‌గుప్తా పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేసిన 50 మంది యువకులను ఆయన అభినందించారు. మారుతి టెక్నాలజీ డైరెక్టర్ కె.మారుతి, ఎస్‌వీ ఇన్ఫోటెక్ డైరెక్టర్ కమలాకర్ రాజు, రోటరీ సర్వీసెస్ డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన..

- వరద నీటితో గోదారిని తలపించిన రోడ్లు
- నిలిచిన ట్రాఫిక్.. వాహనదారుల అవస్థలు

కాలనీలు జలమయం

దిల్‌సుఖ్‌నగర్: గంటపాటు కురిసిన భారీ వర్షానికి మలక్‌పేట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాలు కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి రహదారులపై మురుగు ఏరులై పారింది. వరద నీటితో రహదారులు గోదారిని తలపించాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలాడేరా, మలక్‌పేట రైల్వే బ్రిడ్జి, ఆజంపురా, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో భారీగా నీరు చేరింది.

- వర్షం ధాటికి చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ చౌరస్తా, మలక్‌పేట, కొత్తపేట, నల్గొండ క్రాస్ రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల్లో కొద్దిసేపు రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయం ప్రధాన రోడ్డుపై మోకాలు లోతులో వరదనీరు ప్రవహించింది. దీంతో పాటు యాదవనగర్, తీగలగూడ తదితర లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. కొన్ని గంటలపాటు విద్యుత్ లేకపోవడం, ఆగకుండా కురుస్తున్న వర్షానికి ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.



ఓల్డ్‌మలక్‌పేట ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల ముఠా ఆటకట్టు



నిందితులు చైనరామ్, రానారామ్

హస్తినాపురం: అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠా గుట్టును ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు రట్టు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం పోలీసుల కథనం ప్రకారం... రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ప్రాంతానికి చెందిన చైనరామ్ (20) పాత నేరస్తుడు. మూడేళ్ల క్రితం నగరానికి వలసవచ్చి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. రాజస్థాన్‌కే చెందిన రానారామ్(30) సంగారెడ్డి జిల్లా కొల్లూరులో మాతాజీ హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు.

- ఆర్థిక సమస్యల నేపథ్యంలో చైనరామ్ మత్తు పదార్థాలు విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో చైనరామ్‌కు మధ్యప్రదేశ్‌కు చెందిన పూర్‌సింగ్ రాజ్‌పుత్‌తో పరిచయం ఏర్పడింది.
- పూర్‌సింగ్ రాజ్‌పుట్ గసగసాలు, నల్లమందును నగరం చుట్టుపక్కల ప్రాంతాలను విక్రయించేవాడు. ఇదే తరహాలో రాచకొండ కమిషనరేట్ పరిధి చైతన్యపురి పీఎస్‌లో నిందితుడిగా ఉన్నాడు.
- చైనరామ్ నిషిద్ధ మాదక ద్రవ్యాన్ని పూర్‌సింగ్ రాజ్‌పుట్ నుంచి కిలో గ్రాము రూ.50 వేలకు కొనుగోలు చేసి రూ.4లక్షలకు విక్రయించేవాడు.
- ఆ తర్వాత గసగసాల పొడిని తయారు చేసి బైక్‌పై తరలిస్తూ వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో చైనరామ్‌కు రానారామ్ పరిచయం పెరిగింది. కమీషన్ పద్ధతిపై రానారామ్ చైనరామ్‌కు వినియోగదారులను పరిచయం చేసేవాడు.
- ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు పక్కా సమాచారంతో నిందితులను సుష్మ చౌరస్తా వద్ద నిషేధిత వస్తువులతో పట్టుకున్నారు.
- వారినుంచి గసగసల గడ్డి 7 కిలోలు, నల్లమందు 70 గ్రాములు, మోటర్ సైకిల్, రూ.2 వేల నగదు, తాసు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పూర్‌సింగ్ రాజ్‌పుత్ పరారీలో ఉన్నాడు. వనస్థలిపురం పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

తాగి డ్రైవింగ్ చేసిన వాహనదారులకు జైలు

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చినట్టు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.17 మందిని 9వ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి వారిలో 14 మందికి జరిమానా, ముగ్గురికి జైలు శిక్ష విధించారన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన శేఖర్‌కు 3 రోజులు, నల్లగొండకు చెందిన ఆర్.పవన్‌కుమార్ రెండోసారి పట్టుబడగా రూ.3300 జరిమానా, 3 రోజులు జైలుశిక్ష, మలక్‌పేటకు చెందిన సాయికుమార్ రెండోసారి పట్టుబడగా రూ.3300 జరిమానా, 2 రోజులు జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

దృష్టి మరల్చి గొలుసు ఎత్తుకెళ్లిన యువకుడి అరెస్టు

చంచల్‌గూడ: వృద్ధురాలి దృష్టి మరల్చి 3 తులాల బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. మాదన్నపేట సీఐ సునీల్ కథనం ప్రకారం... చంద్రయ్యహట్స్‌కు చెందిన మల్లమ్మ (68) మాదన్నపేట పోలీసు స్టేషన్ దారిలో నడుచుకుంటూ వెళ్తుండగా, అక్కడే మాటువేసిన ఉన్న సాయిలాల్‌తోటకు చెందిన షేక్ ఆరీఫ్ (23) మల్లమ్మ వద్దకు వచ్చి దొంగలున్నారు.. గొలుసును జాగ్రత్తగా పెట్టుకోండి అని అన్నాడు. దీంతో ఆమె తన మెడలో ఉన్న 3 తులాల బంగారు మంగళసూత్రాన్ని తీసి భద్రపరుస్తుండగా, ఒక్కసారి చూస్తానని గొలుసు తీసుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నాడు. అతడి వద్ద నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు రౌడీషీటర్ల బైండోవర్

నాగోలు: ఎన్నికలు సమీస్తున్న కారణంగా ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు రౌడీషీటర్లను పోలీసులు గురువారం బైండోవర్ చేశారు. ఎల్‌బీనగర్ మల్లికార్జుననగర్ నివాసి మంద మహేష్, ఆర్టీసీ కాలనీ నివాసి ఆడాల యాదయ్యను పోలీసులు సరూర్‌నగర్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

స్ట్రైకింగ్‌లో మహెద్‌కు గోల్డ్ మెడల్

మలక్‌పేట: ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో జరిగిన స్ట్రైకింగ్ ఏంఎంఏ చాంపియన్‌షిప్–2023లో తెలంగాణ నుంచి మూసారంబాగ్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ మహెద్ (15) ఎంఎంఏ–50 కేజీ వెయిట్ కేటగిరీలో గోల్డ్‌మెడల్ సొంతం చేసుకున్నాడు. నిర్వాహకులు ఆదిత్య, డాక్టర్ దీప్ సాహిత్య, డాక్టర్ కె. చంద్రశేఖర్ చేతుల మీదుగా మహెద్‌కు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ బహూకరించారు.

పాలెం శివకృష్ణకు జాతీయ అవార్డు

నాగోలు: ఎల్‌బీనగర్ అల్కాపురి చెందిన ఇండో ఇన్ఫ్రా డెవలపర్స్ సీడీడీ డాక్టర్ పాలెం శివకృష్ణ గౌడ్‌కు జాతీయ స్థాయిలో బెస్ట్ ఇన్నోవేటివ్ సేల్స్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. సేవా రంగంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో మంచి సేల్స్‌తో దూసుకు పోతున్నందుకు ముంబైకి చెందిన సేల్స్ ఎల్ అండ్ డి విజన్ అండ్ ఇన్నోవేషన్ సంస్థ ఈనెల 13న ముంబైలో ఈ అవార్డును అందజేసింది.

ఐవీఎఫ్ కల్చరల్ కమిటీ కో చైర్మన్ల నియామకం

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కల్చరల్ కమిటీ కో చైర్మన్లుగా కటకం భాస్కర్, తోట శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వీరికి ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా గురువారం నాగోలులోని తన క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఐవీఎఫ్ రాష్ట్ర కల్చరల్ కమిటీ చైర్మన్ కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సైదాబాద్: అర్హులైన అందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యాకత్‌పురా ఎమ్మెల్యే పాషా ఖాద్రీ అన్నారు. గురువారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డితో కలిసి 30 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. సైదాబాద్ మండలం తహసీల్దార్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభ ప్రాంగణం పరిశీలన

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడలో ఈనెల 17న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే విజయభేరి సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి గురువారం పరిశీలించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, బొక్క భూపాల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మన్న రవికుమార్, తుక్కుగూడ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధి బాంబేకాలనీలోని బీజేపీ నేతలు శ్రీధర్‌గౌడ్,శ్రీకాంత్, మహికాంత్‌ల ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. నాయకులు సత్యంచారి, శ్రీనివాస్‌యాదవ్, కల్యాణ్, ఆదిలక్ష్మి, నాగిరెడ్డి, అనిత, నారాయణచారి, రెడ్డిమాల కృష్ణ, నరేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడంపై బీజేపీ నిరసన



లింగోజిగూడలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

నాగోలు: నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాగోలు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాగోలు చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్, బీజేపీ నాగోలు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణగౌడ్, నాయకులు కటకం నర్సింగ్‌రావు, సిద్దాల ఐలయ్య, సంజీవరెడ్డి, నరేందర్‌రెడ్డి, డప్పు రాజు, వినోద్‌రెడ్డి, రావుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగోజిగూడ డివిజన్‌లో..

కిషన్ రెడ్డి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్ బ్యాంకు కాలనీ చౌరస్తాలో కేసీఆర్ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. విజయ భాస్కర్, కిరణ్, కృష్ణం రాజు, భోస్లే శ్రీనివాస్, హరి ప్రసాద్, గట్టురవి, గణేష్ పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో...

చంపాపేట: కిషన్‌రెడ్డి దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం చంపాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు వీరారెడ్డి, రమేష్, శ్రీశైలం, యోగి రాజ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించండి

ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. పంజేషాహలోని కార్యాలయంలో గురువారం ఆయన కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, డివిజన్ల వారీగా రోడ్లు, పార్కులు, కమ్యూనిటీహాళ్లు, నాలాలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో మజ్లిస్ కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, ఎంఏ సలామ్ షాహిద్, సర్కిల్–6 జీహెచ్ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏడీఈ, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సైట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఓటుతో బ్రాహ్మణుల సత్తా చాటాలి

వనస్థలిపురం: బ్రాహ్మణుల సంఖ్య తక్కువని అన్ని రాజకీయ పార్టీలు మనల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, ప్రతి బ్రాహ్మణుడు ఓటు హక్కును వినియోగించుకొని సంఖ్యాబలాన్ని చాటాలని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు అన్నారు. గురువారం బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో వనస్థలిపురం అభ్యుదయనగర్‌లో బ్రాహ్మణ రాజకీయ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుకిరణాచార్యులు మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలోని అనేక నియోజకవర్గాలలో ఉన్న బ్రాహ్మణులంతా ఏకమైతే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావితం చేయాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామన్నారు. బ్రాహ్మణ సంఘాలన్నీ ఏకమైతే అన్ని నియోజకవర్గాలలో బ్రాహ్మణ భవన్, అపర కర్మల భవనం, అన్ని రకాల ప్రాముఖ్యతను ఇచ్చే వారికి పార్టీతో సంబంధం లేకుండా మద్దతు ఇవ్వొచ్చని అన్నారు. బ్రాహ్మణులు పోటీచేసే ప్రాంతంలో వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. త్వరలో వేలాది మంది బ్రాహ్మణులతో గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ సభను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సేవా వాహిని ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరశర్మ, మంగపతిరావు, వక్కలంక శ్రీనివాస్, ఆలూరి, ఏవీఆర్ మూర్తి, గిరి, ప్రసాద్, శ్రీనివాస రంగాచార్యులు, కృష్ణమాచార్య, రంగబాబు, ప్రమోద్, సుధాకర్, భరత్ పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి: మాదిగ దండోరా



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లేష్, శ్రీధర్ తదితరులు

మలక్‌పేట: ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరున 10 ఎకరాలలో స్మృతివనం ఏర్పాటు చేయాలని మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవల్ని గుర్తు చేసుకున్నారు. మల్లేష్ మాట్లాడుతూ.. 'పొడుస్తున్న పొద్దు మీద.. నడుస్తున్న కాలమా పోరు తెలంగాణ' అంటూ గద్దర్ ఆట, పాట ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించిందన్నారు. మూడు తరాల నుంచి ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నడిపిన త్యాగశీలి అని, తెలుగు యూనివర్సిటీకి, మేడ్చల్ జిల్లాకు గద్దర్ పేరును ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ శ్రీధర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు మీనా శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమార స్వామి, నాయకులు పోలే అంజయ్య, మేడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు పేదరికం అడ్డురాదు



జయలక్ష్మిని సన్మానిస్తున్న సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: అనుకున్నది సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని, అందుకు పేదరికం అడ్డు కాదని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. సింగరేణి కాలనీలోని గుడిసెల్లో నివసిస్తూ తల్లిదండ్రులకు తోడుగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ఐఏఎస్‌కు సిద్ధమవుతున్న విద్యార్థిని జయలక్ష్మిని గురువారం మాజీ కార్పొరేటర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి సన్మానించారు. రెండు రోజుల క్రితం జయలక్ష్మి గురించి సాక్షిలో 'చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ' అనే శీర్షికన ప్రచురితమైన కథనం అందరినీ ఆకట్టుకుంది. ఇలా ఉండగా, జయలక్ష్మి యునైటెడ్ స్టేట్స్–ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి నుంచి గాం. దీ–కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్ స్కాలర్‌షిప్ పొంది అమెరికాలో రెండు వారాల పర్యటన ముగించుకొని నగరానికి వచ్చింది. గురువారం ఆమెను స్వప్నా సుందర్‌రెడ్డి సన్మానించారు. యాకత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, రాజు రాథోడ్ పాల్గొన్నారు.

భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఎర్ర జెండాది: సీపీఐ (ఎం)

మన్సూరాబాద్: రైతాంగ సాయుధ పోరాటంలో మూడు వేల గ్రామాల్లో భూస్వాములను తరిమికొట్టి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాటి నిజాం సర్కారు మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు, ఉచిత పథకాలు సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందూత్వం పేరుతో, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ సెంటిమెంట్‌తో మళ్లీ అధికారం చేపట్టాలని యత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో చంద్రమోహన్, పగడాల యాదయ్య, ఏర్పుల నర్సింహ, వెంకన్న, ఎల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను దోచుకుంటున్న ముగ్గురి అరెస్టు

హయత్‌నగర్: కల్లు, గంజాయి సేవిస్తూ రాత్రిపూట బైకులపై తిరుగుతూ ప్రయాణికులను భయపెట్టి దోచుకుంటున్న ముగ్గురిని హయత్‌నగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం...మీర్‌పేట గాయత్రినగర్‌కు చెందిన కంటె త్రినాథ్ బైకు రైడర్, జగద్గిరిగుట్టకు చెందిన కరిమెండి మధుకుమార్ బైకు మెకానిక్, కొమ్ము రాకేష్ క్యాటరింగ్ వర్కర్. స్నేహితులైన ఈ ముగ్గురూ రాత్రిపూట గంజాయి, కల్లు తాగి బైకులపై నగర శివార్లలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న వారి బెదిరించి డబ్బులు, సెల్ ఫోన్లు దోచుకుంటున్నారు. ఈ నెల 12న ఖమ్మంకు చెందిన ఓ యువతి నగరంలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ అర్ధరాత్రి తర్వాత తన పరిచయస్తుడైన ఓ యువకుడితో కలిసి ఖమ్మం వెళ్లేందుకు పెద్దఅంబర్‌పేట వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో బైకుపై వచ్చిన ముగ్గురు దుండగులు వారిని డబ్బులు అడిగారు. నగదు లేక పోవడంతో యువతి ఫోన్ నుంచి రూ.200 ఫోన్‌పే చేయించుకున్నారు. అనంతరం యువకుని ఫోన్‌ను లాక్కుని పసుమాముల వైపు వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్, ఫోన్ నెంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం పసుమాముల కళానగర్ సమీపంలో ముగ్గురు గంజాయి సేవిస్తుండగా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు



విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సైదాబాద్: యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. గురువారం సైదాబాద్‌లోని మాతృశ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత–ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను వివరించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడ, రాంగ్ రూట్‌లో వెళ్లడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రహదారులపై వాహనాలు నడిపే సమయంలో క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. అతివేగం వల్ల ఇతరుల వాహనాలను ఢీకొని ఇరువురికీ నష్టం జరుగుతుందన్నారు. మరీ ముఖ్యంగా మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, అది చట్టపరంగా నిషేధమని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, టీటీఐ హెచ్‌సీ శ్రీధర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.